కథానిక

# కీర్తి దాహం

"బదరీనాథ్"

నాకు అంతర్జాతీయ కీర్తి దాహం చాలా యెక్కువని మీ అందరికీ తెలుసును. అయితే-కవిగా సంపాదించలేని ఆ కీర్తిని అఖండంగా సంపాయించుదామని ఒక ప్లాను వేశాను. ఒక ప్రణాళిక తయారుచేసేను. దాని మహాత్మ్యం చెప్పాలంటే మూడుకోట్ల గ్రంథాలైనా వ్రాయవలసివుంటుంది. కాని, అసలు నాది ప్లానులతో క్రిక్కిరిసిపోయిన బుర్రగాబట్టి, మూడు కోట్ల గ్రంథాల్లో చెప్పాల్సిన దాన్ని మూడు ముక్కల్లో తేల్చి చెప్పేస్తాను. అది అద్భుతమైనదీ, అసమానమైనదీ, అద్వితీయమైనదిన్నీ. అంతటి ప్రణాళికని, అంత అత్యద్భుతమైన ప్లానుని యిప్పుడు మీకు చెప్పేస్తున్నాను.

ఏమిటీ అంటే- విశ్వ శాంతి మహా పరిషత్తంటూ ఒకదాన్ని పెట్టి ప్రపంచంలో వుండే శాంతి కాముకులందర్నీ సమావేశపరచి దానికి అధ్యక్ష పదవిని నిర్వహించి, విజయవంతంచేస్తే ప్రపంచంలోని ప్రతి పత్రికలోనూ నా పేరు మారుమ్రోగిపోవడమే కాకుండా నాకు నోబుల్ ప్రైజు యిద్దామనేటువంటి సజెషన్సున్నూ బయల్దేరతాయ్. ప్రొడ్యూసర్లూ, డైరెక్టర్లూ నా జీవిత చరిత్రను చిత్రంగా తీస్తారు. నేనెక్కడ ఉపన్యాసమిస్తున్నా ఇన్‌ఫర్మేషన్ ఫిల్మ్స్ వాళ్లు వచ్చి, నా ఉపన్యాసాన్ని రికార్డు చేసి సినీమా తీసుకుపోతారు. నా ప్రజలూ, పత్రికాధిపతులూ, నా ఆటోగ్రాఫ్స్ కోసమూ ఆటోగ్రాఫ్డ్ ఫోటోగ్రాఫ్స్ కోసమూ, నన్ను ఊపిరి సలపనీయకుండా చుట్టు ముట్టేస్తారు. మెడ తిప్పుకునేందుకు వీల్లేకుండా చెమ్కీ దండలతో కంఠ సీమ నలంకరించి పారేస్తారు. 'ఫలానా...నాకూ జై' అనే జయ జయ ధ్వానాలు మిన్నుముట్టుతై.

ఈ ఆలోచనా తరంగాలు ఒడ్డుని ఢీకొని బోర్లాపడి ఆయాసంతో నురగలు కక్కుకుంటూంటే, ఆ సాయంత్రం అలా గోదావరిగట్టుకి షికారుగా వెళ్ళాను. అక్కడో సాయిబు, హైడ్రోజన్ గేస్‌తో బెలూన్‌లు నింపి అణా అణా కమ్ముతున్నాడు. ఆ రబ్బరు బెలూన్లని చూడ్డంతోటే నాకు హైడ్రోజన్ బాంబు జ్ఞాపకం వచ్చింది. ఈ హైడ్రోజన్ బాంబే కదా ప్రపంచ వినాశనానికి కారణం, దీనివల్లే కదా ప్రపంచంలో శాంతి అనేది నాశనమై పోయింది. అనే భావన రాగానే దీని స్నేహితురాలైన యాటంబాంబునీ దీన్నీ కూడా నాశనం చెయ్యాలని కంకణం కట్టుకున్నాను. (మనస్సులోనే తద్వారా కీర్తిన్నీ సంపాదించొచ్చు). వీటినిగురించి, నేను ప్రవేశపెట్టబోయే విశ్వ శాంతి మహాపరిషత్తులో యేకధాటిగా ఉపన్యసించి అత్యద్భుతమైన సాహసకృత్యాలు చేసేద్దామనుకున్నాను. ఒక అణా పెట్టి నేనూ ఆ బెలూన్ కొని, దాన్ని అతి జాగ్రత్తతో దూర దూరంగా వుంచి పరీక్షిస్తూ, శాంతి విధ్వంసకాలైన యాటం, హైడ్రోజన్ బాంబుల్ని గురించే ఆలోచిస్తూ యింటికి చేరుకుని పడక కుర్చీలో మేను జారేశాను.

నేను విశ్వశాంతి మహాపరిషత్తుని సమావేశపరచబోతున్నాననీ యాటం, హైడ్రోజనుల్ని నాశనంచెయ్యడానికి నడుం కట్టుకొన్నాననీ, వాటికెట్లా తెలిసిందో కాని, కారుతూన్న కన్నీళ్ళతో, వాలేసిన ముఖాలతో, యీడ్చుకుంటున్న కాళ్ళతో వచ్చి నాముందతిదీనంగా నిలబడినై. స్వతహాగా నాది చాలా మెత్తటి హృదయం గాబట్టి వాటిని-"కాటుక కంటినీరు చనుకట్లపయిం బడనేల యేడ్తురో" అంటూ ఓదార్చేసి దాన్తోపాటు "మీరెవ్వరో?" అని అడిగాను తెలిసికూడా సందేహ నివృత్తి చేసుకుందామని.

"నేను హైడ్రోజను బాంబునీ, అది యాటం

బాంబూను-" అని చెప్పటంతోటే అదిరిపడి హఠాత్తుగా కాస్త దూరంగానే జరిగాను యెందుకైనా మంచిదని. జరిగింతర్వాత కాస్త ధైర్యం తెచ్చుకుని, మేకపోతు గాంభీర్యంతో- "మీరిక్కడి కెందుకొచ్చారు?" అని అడిగాను గట్టిగా. నా ప్రతాపాన్ని గురించి విని ముందర కాస్త 'తా' రెత్తినా, నన్ను చూసి ప్రస్ఫుటమయ్యే నా మేకపోతు గాంభీర్యాన్ని చూసి, అవి నన్ను తక్షణం లోకువ కట్టేసి, తమ సురక్షితాన్ని గేరంటీచేసుకుని అతి ధైర్యంగా మాట్లాడ్డం మొదలుపెట్టాయ్.

"ఏవయ్యా? నువ్వు విశ్వశాంతి మహాపరిషత్తు సమావేశ పరుస్తానన్నావుగా! మమ్మల్నేం చేద్దామనీ నీ ఉద్దేశ్యం?" అని గద్దించింది యాటంబాంబు. నా గుండెలు అతి వేగంతో కొట్టుకుంటున్నా పైకి గంభీరంగానే ఉన్నాననుకుంటున్నాను. అంత గంభీరంతోటీ, ఆటం బాంబుకి నేను సమాధానం చెప్పాను.

"అవును. నేను శాంతి మహాసభ జరుపుదామనుకున్నా నంతేగాని మిమ్మల్నేమీ చేద్దామనుకో లేదే!"

"మరి ప్రపంచం అంతా శాంతినే వాంఛిస్తే మా గతేవిటని ఆలోచించావ్. మేం యేమైపోతామనుకున్నావ్?" మీదపడి కొట్టొచ్చేటట్లుగా అరిచింది హైడ్రోజను బాంబు. 'ఏమంటావ్?' అన్నట్లు యాటంబాంబుకేసి చూసింది. 'అవు' నన్నట్లు యాటంబాంబు తలూపి "ఏం సమాధానం చెపుతావో చెప్పు" అన్నట్లు నాకేసి చూసింది. నాకు వెంటనే ఒక మెరుపులాంటి సమాధానం తట్టింది. అదే చెప్పాను. "నేను శాంతి మహాసభ పెట్టినా, ప్రపంచం అంతా కట్టుకట్టినా, మీరు మీలాగే వుంటారుకాని మీకు యేమాత్రం అపాయమున్నా రాదు. శాంతి మహాసభ మాకు గాని మీకుగాదు." ఈదెబ్బతో లీడింగ్ బాంబ్సు రెండూ సంతుష్టిపడి వెళ్ళిపోతాయనుకున్నాను. "ఓహో! అల్లాగా!" అంటాయనుకున్నాను. కాని నేనూహించినట్టూ జరగలేదు. నే నూహించిన సమాధానమున్నా రాలేదు. పైగా నన్నో తెలివిమాలిన దద్దమ్మకింద కట్టేసి మరీ మాట్లాడేయ్.

"ఓహో! అల్లాగేం. అయితే- ఓ తెలివితక్కువ దద్దమ్మా. మీరంతా శాంతి శాంతని, దాన్ని పట్టుకు వేళ్ళాడితే మరి మమ్మల్నుపయోగించేదెవరోయ్. మా గతేవిటీ?" అన్నది యాటం.

"మీరు సురక్షితంగా వుండాలీ అంటే యేవిటీ? మీరీపళంగా యిల్లాగే వుండిపోవాలి. మిమ్మల్నేదేశమైనా ఉపయోగిస్తుందనుకోండి. అసలనుకుందాం! ఎలా ఉపయోగిస్తుంది? ముందుమిమ్మల్ని విమానంమీదెక్కించి, అక్కణ్ణించి ఆకాశంలోకె తీసుకెళ్ళి, అంత యెత్తునుంచి ఉన్నట్టేవుండి అమాంతం తోసి పారేస్తుంది. దాంతోటి గిరగిరా తిరిగి భూమ్మీద పడి ఛిద్రఛిద్రపలై, ముక్కముక్కలై అక్కడక్కడ పడి, పున్నపళంగా కాలిపోతారు. ఇది మీకు బాధకాదూ? తెలిసిందా? అంచేతను మీరు పగిలిపోకుండా ఉండడంకోసం, మీసుఖం కోసమే అసలీపన్నాగాన్ని పన్నను" అన్నాను. ఇదివిని నా ఉదారబుద్ధికి సంతోషించి వాటి ప్రాణాలు కాపాడుతున్నందుకు నన్నభినందించి నాకు బ్రహ్మరథం పట్టేస్తా యనుకున్నాను. నేననుకున్నట్టు నాకు బ్రహ్మరథమే పట్టాయిగాని, నే ననుకున్న బ్రహ్మరథం అర్థంమాత్రం దీనికి వర్తించదు. రెండు నాయక బాంబులూ నా రెండు పక్కలకీ వచ్చాయి. అమాంతం కళ్ళుమూసేసి చీపురు మొట్టికాయలు మొట్టేస్తా యనుకున్నాను. అంత పనిమాత్రం జరగలేదుగాని, అంతకంటే యెక్కువదే జరి



గింది. చూస్తుండగా నా చెరో జెబ్బాపట్టుకుని అటూయిటూ గాలిలో ఉయ్యాల్లాగా ఊపి పరుపుమీద హాయిగా పడుకున్న మా కుక్కపిల్ల మీదికి విసిరేశాయ్. ఇంత మనిషినీ 'ధభా'లని ఆ కుక్కపిల్లమీద పడ్డంతోటే, అది చచ్చినంత పనయి, పూర్తిగా అదిన్నీ అవక 'మెయ్యో'మని కుంటుకుంటూ వెళ్ళిపోయింది. పరుపుమీద సురక్షితంగా పడ్డ నేను, నాకేసి చూసి, నాకో గుణపాఠం నేర్పినట్లు పకపకా నవ్వుతున్న ఆ రెండు బాంబుల కేసీ అదో మాదిరి వెర్రిమొహంతో చూసేను నన్ను చూసి జాలిపడ్డట్టు ఆటంబాంబు సానుభూతి పూర్వకంగా అడిగింది. "దెబ్బ తగిలిందా" అని. లేదన్నట్లు బుర్ర వూపాను. దెబ్బతోటి హైడ్రోజను బాంబు అందుకుని నాకో ఉపన్యాసం యివ్వడం ప్రారంభించింది. "ఇంత ఎత్తునించీ నిన్ను మేం మెత్తటి పరుపు మీద విసిరెయ్యడంతోటే యేంజరిగిందీ, అడుగు నన్ను కుక్కపిల్లి కిసుక్కుమంది. అంత మాత్రం తోటే యెందుకు సరిపోయిందంటే, పడ్డది నువ్వుగాబట్టి. మరినీకెందుకు దెబ్బతగల్లేదయ్యాఅంటే, పడ్డది మెత్తటి పరుపుమీదగాబట్టి. అల్లాగే మేం యెత్తుమీంచిపడ్డా, మా ప్రాణాలకి మెత్తటి పరుపైన భూమ్మీదనే పడతాం. మా కిందని మీరంటారు. మీలో పూర్తిగా శాంతి ఉండకపోయినా, అక్కడక్కడ గబ్బిలంలా అంటిపెట్టుకునుంటుంది. దాన్ని పూర్తిగా నాకి తింటేనే గాని మా ఆకలి తీరదు.

"అంచేత నువ్వు నిజంగా మా సుఖాన్నే కోరేవాడివైతే, నువ్వు విశ్వశాంతి మహా పరిషత్తు సమావేశపరచొద్దు. శాంతి ప్రసంగాలున్నూ చెయ్యొద్దు. "ఈ రెండింటిలో యేదైనా చేశావా? జాగ్రత్త! ప్రాణాలు దక్కవ్!" అంది నాలిక రెండు పళ్ళవరసల మధ్యనీ నొక్కిపట్టి, నాకేసి మింగేసేలాగ ఓర కళ్ళతో చూస్తూనూ. నాకు యేంచెయ్యడానికీ తోచక, కర్తవ్యతా విమూఢుణ్ణయి—"మరి నా కంతర్జాతీయ కీర్తి వచ్చేదెలా?" అన్నాను యేడుస్తూ. ఏంచెయ్యడానికి తోచక చంటిపిల్లాడిలా యేడుస్తున్న నన్ను చూసి జాలిగా, ఓదార్పుగా "అయితే అంతర్జాతీయ కీర్తి కోసమా నాయనా యీ పరిషత్తు యెత్తూ!" అంది వీపునిమురుతూ హైడ్రోజన్ బాంబు. "ఆఁ. మరే!" అన్నాను కళ్ళు తుడుచుకుంటూ వాటికేసిచూసి. ఆరెండూ 'ఫకాల్న' నవ్వుకున్నయ్. నాకిలోపున ఒకాలోచన వచ్చింది. ఈ హైడ్రోజను బాంబూ, యాటంబాంబూ పుట్టడానికి కారకులెవరు? నేను. నేనంటే నేను కాకపోయినా- నా జాతి మానవుడు. నేను గూడా మానవుణ్ణే గాబట్టి హైడ్రోజన్ ఆటంబాంబులను కనిపెట్టిందీ పుట్టించిందీ నేను. వాటి జన్మాలకు కారణభూతుణ్ణయిన నేను వాటి మరణానికి కూడా యెందుకు కారణభూతుణ్ణి కాకూడదు? ఈ ఆలోచన రాగానే నాలో నూతన జవసత్త్వాలు రా నారంభించినై. నా శరీరం నిముషం నిముషమూ పెరిగిపోవడం ప్రారంభించింది. నా ముందు యే బాంబులైతే పర్వతాల్లాకనిపించాయో ఆ బాంబులే నా ముందిప్పుడు లిల్లీ పుట్లలా వున్నై. నా విశ్వరూపాన్ని చూసి నాకే ఆశ్చర్యమేసింది. నాఒళ్ళు నాకే బరువనిపించింది. ఒంగి రెండు బాంబుల్నీ చేత్తో తీసుకుని, అరచేతిలో పెట్టుకొని పరీక్షగా చూసేను. అవి రెండూ నాకేసి చూసి గడగడా వణకడం ప్రారంభించినై. నాకు నవ్వొచ్చింది. వాటిని వేళ్ళ కొసలకి తెచ్చి నల్లుల్ని కలిపినట్లు నలిపి పారేశాను. వెంటనే "ఢా"మ్మని అయిన చప్పుడుకి హడలిపోయి మెలుకువ అయి లేచి చూద్దునుగదా! పగిలిపోయిన రబ్బరు బెల్యూను ముక్కలు నన్ను చూసి నవ్వుతున్నాయ్. నాకూ నవ్వొచ్చింది అంతర్జాతీయ కీర్తి జ్ఞాపకం వచ్చింది.

---

**మామూలు ఆరోగ్యం వున్న మనిషి, రోజుకి ఇరవై సాధారణ రకం సిగరెట్లు కాల్చడంవల్ల హాని ఏమీ జరగదని ఒక డాక్టరు అభిప్రాయం. కాని అడ్వర్టైజ్‌మెంట్లను బట్టి చూస్తే సాధారణ రకం సిగరెట్లే ఉన్నటు కనిపించదు.**